క్లుప్తంగా

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



విదేశీ పర్యటన ముగించుకొని శనివారం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు.

– అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడసెంట్రల్)

సువర్చల వీరాంజనేయ స్వామి కల్యాణం



పాయకాపురం(విజయవాడరూరల్): సువర్చల వీరాంజనేయ స్వామి కల్యాణం శనివారం వాంబేకాలనీలో కనుల పండువుగా జరిగింది. వాంబేకాలనీలో కొలువుదీరిన శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు నిర్వహించిన కళ్యాణ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు వేణుగోపాల్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు హాకీ స్టిక్స్, బాల్స్ పంపిణీ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ఎంబీ స్టేడియంలోని హాకీ క్రీడాకారులకు సీనియర్ హాకీ ప్లేయర్ బి.హేమంత్‌కుమార్ హాకీ స్టిక్స్, బాల్స్ పంపిణీ చేశారు. వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం స్టేడియం ఆవరణలో శనివారం జరిగింది. దీనిలో పాల్గొన్న ఆయన ముందుగా సమ్మర్ క్యాంపు ఆడిన పిల్లలందరికి స్టిక్స్, బాల్స్ అందజేశారు. అనంతరం హేమంత్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల్లో కూడా చిన్నారులు రాణించాలని సూచించారు. తమకు ఆసక్తి కలిగిన రంగాలపై చిన్నారులు పట్టు సాధిస్తే చక్కని ఫలితాలు వస్తాయన్నారు. స్పోర్ట్స్ కోటాలో కూడా ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. ఏ క్రీడలో అయినా ప్రత్యేక శిక్షణ తీసుకొని, నిరంతరం క్రమశిక్షణతో సాధన చేస్తే తప్పకుండా విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ స్టేడియం అజిత్‌సింగ్‌నగర్ హాకీ కోచ్ కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

కేబీఎన్ అధ్యాపకుడు విజయబాబుకు డాక్టరేట్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాల కామర్స్ విభాగ అధ్యాపకుడు టెక్కెం విజయబాబుకు ద్రవిడన్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్‌లోని పలు అంశాలపై సమర్పించిన పరిశోధనా పత్రానికి డాక్టరేట్‌ను లభించిందన్నారు. విజయబాబు కాకరపర్తి భావనారాయణ కళాశాలలో పలు హోదాల్లో పని చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కార్యనిర్వాహక వర్గం విజయబాబును అభినందించారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

- కిటకిటలాడిన దేవాలయాలు
- వేకువజామునుంచే బారులు తీరిన భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. హనుమజ్జయంతి స్వామివారికి ప్రీతికరమైన శనివారం రావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు దేవాలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే భక్తులు దేవాలయాల వద్ద బారులు తీరారు.

దాసాంజనేయస్వామివారి దేవాలయంలో..

స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తడంతో క్యూలైన్ల ద్వారా భక్తులను దర్శనానికి పంపించారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి, ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

రామలింగేశ్వరపేటలో..

రామలింగేశ్వరపేట శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి వడమాలను నైవేద్యంగా సమర్పించి సిందూరం, ఆకు పూజలు చేశారు. మధ్యాహ్నం రెండు వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు తాన్న పూర్ణచంద్రరావు, పూర్ణయ్య శాస్త్రి, మేడిశెట్టి శేషగిరి, ఇంటి సత్యనారాయణ, మోతే దుర్గారావు, కాశి రెడ్డి, లక్ష్మీనరసారెడ్డి పర్యవేక్షించారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో..

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన హనుమజ్జయంతి జరిగింది. అభయాంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. అలాగే పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా స్వామివారికి సిందూరం, ఆకు పూజలు నిర్వహించారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.



పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో శ్రీఆంజనేయస్వామి



అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో స్వామివారు

లెనిన్‌సెంటర్‌లో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు హనుమాన్ చాలీసా పఠనం, రామ నామ జపం చేశారు. మహిళలు ఉపవాస దీక్ష చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు

విజయవాడకల్చరల్: మారుతీ వ్యాయమశాలలోని హనుమత్ దేవాలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారం ముగిసాయి. హనుమజ్జయంతి సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని లక్ష తమల పాకులతో పూజించారు. స్వామివారి చిత్ర పటంతో శోభా యాత్ర నిర్వహించారు. ఉదయం జరిగిన కార్యక్రమంలో వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు. దేవాలయ ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షుడు శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ హనుమంతుని సేవా మార్గం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రసరమ్య కావ్యం రామాయణంలో హనుమంతుని పాత్ర వెలకట్టలేనిదన్నారు. సుందరకాండలో హనుమత్ వైభవం తెలుస్తుందన్నారు. దేవాలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. గండూరి చంద్రమౌళీ, భక్తులు ఉదయం ఎనిమిది గంటలనుంచే స్వామివారి సేవలో పాల్గొన్నారు.



దాసాంజనేయస్వామివారి దేవాలయంలో అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి, ఈఓ భవాని



దాసాంజనేయస్వామివారి దేవాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



రామలింగేశ్వరపేటలో అన్నప్రసాద వితరణ

పాయకాపురం(విజయవాడరూరల్): హనుమజ్జయంతి సందర్భంగా కండ్రికలోని అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం జరిగిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఆకుపూజలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ప్రకాష్‌నగర్‌లోని రామాలయంలోనూ, పాయకాపురంలోని రామాలయంలోనూ హనుమజ్జయంతిని పురస్కరించుకొని పూజా కార్యక్రమాలు జరిగాయి. రాజీవ్‌నగర్‌లోని రామాలయంలో హనుమజ్జయంతి సందర్భంగా పూజలు జరిగాయి.

దాసాంజనేయుని సేవలో ఎమ్మెల్యే మల్లాది



మధురానగర్(విజయవాడసెంట్రల్): అతులిత బలధాముడు, అంజనీదేవి పుత్రుడు, జ్ఞానుల్లో అగ్రగణ్యుడు, సకల గుణ సంపన్నుడైన శ్రీహనుమానుని జయంతి నాకు ఎంతో ప్రీతికరమైన రోజు అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. హనుమజ్జయంతి పర్వదినం పురస్కరించుకుని శనివారం ఆయన మాచవరం దాసాంజనేయ స్వామి, బుడమేరు వంతెన సమీపంలోని శ్రీఅభయాంజనేయస్వామి, మధురానగర్‌లోని ఆంజనేయస్వామివారి దేవాలయాలను సందర్శించారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ధూప దీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. అంజనీపుత్రుడైన ఆంజనేయుడు మహా బలవంతుడు, పరాక్రమశాలి అని.. అంతకుమించి శ్రీరామచంద్రునికి పరమభక్తుడిగా దాస్యభక్తిని చాటారన్నారు. శ్రీరామ నామస్మరణ ఎక్కడ జరిగితే అక్కడ హనుమంతుల వారు కొలువై ఉంటారని, ఆవిధంగా ఆంజనేయుడు మనమధ్యే ఉన్నారని చెప్పారు. ఎవరైతే ఆ అతులిత బలధాముని మనసారా సేవిస్తారో వారికి అష్టసిద్ధులు ప్రాప్తిస్తాయని పేర్కొన్నారు. ఆ ప్రసన్నాంజనేయుని దివ్య ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని.. స్వామివారి కృపా కటాక్షాలతో ప్రతి ఒక్కరూ జీవితంలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

దుర్గమ్మ సన్నిధిలో..



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం హనుమత్ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన అభయ వీరాంజనేయ స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. ఘాట్‌రోడ్డులోని స్వామి వారి ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద, పాత మెట్ల మార్గంలోని స్వామి వారి ఆలయంలో మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, తమలపాకులతో అర్చనను ఆలయ అర్చకులు చేశారు. దేవస్థాన వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో స్వామి మూల మంత్ర జపం, మూల మంత్ర హవనం, మాన్యుసూక్త పారాయణ, సుందరకాండ పారాయణ జరిగింది. అనంతరం ఘాట్‌రోడ్డులోని ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారిని పెద్ద సంఖ్యలో ఉభయ దాతలు, భక్తులు దర్శించుకుని పూజా కార్యక్రమాలను జరిపించుకున్నారు.



మారుతీ వ్యాయమశాల దేవాలయంలో పూజలు అందుకుంటున్న స్వామివారు



లెనిన్‌సెంటర్‌లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

13 నుంచి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు



శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో శనివారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి విశేషంగా పూజలు అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి దేవాలయం సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ గురువారం ఉదయం ఎనిమిది గంటలకు స్వామివారికి తిరుమంజనం, 108 కలశాలతో శుద్ధ జలాభిషేకం, ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగుతాయన్నారు. 14వ తేదీ శుక్రవారం నవ ధాన్యాభిషేకం, సుదర్శన నవగ్రహ హోమం, లక్ష్మీనరసింహ స్వామికి పాసుపత హోమం జరుగుతుందన్నారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు 15వ తేదీ శనివారం లోక కల్యాణార్థం శాంతి కల్యాణం జరుగుతుందని తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం పవలింపు సేవతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు. భక్తులు వార్షిక బ్రహోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆమె కోరారు.

5న మాస శివరాత్రి పూజలు, అభిషేకాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఈనెల 5వ తేదీ బుధవారం మాసశివరాత్రిని పురస్కరించుకుని మరకత పోలిక శ్రీభవానీ శంకరస్వామివారికి విశేషంగా అభిషేకం, అర్చనలు నిర్వహించనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశేషమైన మాసశివరాత్రి పర్వదినంలో భక్తులు స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. కావున భక్తులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా డాక్టర్ గౌతంరెడ్డి కోరారు.

చాలీసా పారాయణం సర్వపాప హరణం



హనుమంతుని విగ్రహానికి పూజలు చేస్తున్న బాబి శర్మ, భాను శర్మ తదితరులు

విజయవాడకల్చరల్: హనుమాన్ చాలీసా పారాయణం సర్వపాపహరణమని భువనేశ్వరీ పీఠాధిపతి కలమలానంద భారతీస్వామి అనుగ్రహ భాషణ చేశారు. జయహో భారతీయం ఆధ్వర్యంలో సంగీత కళాశాలలో హనుమజ్జయంతి సందర్భంగా నిర్వహించిన హనుమాన్ చాలీసా మహా పారాయణం కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు.

స్వామీజీ మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పారాయణం కులమతాలకు అతీతంగా చేయవచ్చునని సూచించారు. చాలీసాలో హనుమంతుని గుణగణాలు, అతని బలం, భక్తితత్వం కనిపిస్తాయన్నారు. ప్రతి ఇంటిలోనూ నిత్యం పారాయణం చేయాలని సూచించారు. హనుమత్ భక్తి తత్వం ప్రచారకులు, హనుమత్ ఉపాసకులు ఎమ్ఎస్ శ్రీనివాసరావు హనుమాన్ చాలీసాను మధురంగా గానం చేశారు. ఋత్వికులు మంగళంపల్లి బాబి శర్మ, జొన్నలగడ్డ భాను శర్మ, మేడూరి శాంతి కిషోర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన హనుమత్ విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. నాగవల్లి, సిందూర పూలతో అర్చించారు. వల్లీశ్వర్, శ్రీనివాస రెడ్డి, యాబలూరి లోకనాథ శర్మ, కామేశ్వర శర్మ తోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

విద్యార్థులు మహనీయుల ఆలోచనలను అలవర్చుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు జాతిపిత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అలవర్చుకోవాలని గాంధీ ఆశ్రమం నిర్వాహకుడు ఆర్ఆర్ గాంధీ నాగరాజన్న అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం మహనీయుల జీవిత గాథలపై అవగాహన కల్పించారు. ఆర్ఆర్ గాంధీ నాగరాజన్న మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల అవగాహన పెంచుకుని శ్రేయస్సు కోసం పాటుపడాలన్నారు. మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. గాంధీ ఇచ్చిన సందేశాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు చదరంగంలో శిక్షణ నిచ్చారు.

కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి, విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్ఆర్ గాంధీ నాగరాజన్న

కౌంటింగ్ నేపథ్యంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



మోహనరెడ్డి, పటమట సీఐ

పటమట(విజయవాడతూర్పు): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 4వ తేదీన జరుగుతున్న నేపథ్యంలో పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయవాడతూర్పు, గన్నవరం నియోజకవర్గాల్లో ఎలాంటి అల్లర్లకు, హింసాత్మక ఘటనలకు చోటులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని పటమట స్టేషన్ సీఐ మోహనరెడ్డి తెలిపారు. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలోని అన్ని డివిజన్లు, 5 గ్రామాల్లో ఎన్నికల్ కోడ్ సీఆర్‌పీసీ 144 సెక్షన్, 30 సెక్షన్ పోలీస్ యాక్ట్ ఇంకా అమలులో ఉందని, ఈ నెల 4వ తేదీ ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలన్నారు. సమన్వయం పాటించి ఏ విధమైన దుందుడుకు చర్యలకు, గొడవలకు గాని వెళ్లరాదని శాంతియుతంగా ఉండాలని ఆయన కోరారు.

ర్యాలీలకు అనుమతులు లేవు..

అలాగే ఎటువంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవని సీఐ స్పష్టం చేశారు. ర్యాలీలకు జనాలను, మోటార్ వాహనాలను సమీకరించడం, మందుగుండు సామాన్లు కాల్చడం, డీజేలు ఏర్పాటు చేయడం వంటి శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడటం, రెచ్చగొట్టే పనులు చేసిన, కవింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై ఇప్పటికే రాజకీయ పార్టీలకు చెందిన పలువురు వ్యక్తుల వివరాలు సేకరించి వారికి నోటీసులు అందించామని చెప్పారు. ఫలితాల రోజు వ్యక్తిగతంగా గాని, పార్టీల పరంగా సామాజిక మాధ్యమల ద్వారా కవ్వింపు చర్యలకు పాల్పడే అసాంఘిక శక్తులను ఉపేక్షించేది లేదని అవసరమైతే వారిపై రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. పెట్రోల్ బంకుల్లో బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ కొట్టవద్దని అన్ని పెట్రోల్ బంకు యాజమాన్యాలకు సూచించామని, ఈ ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా సదరు బంకుల లైసెన్సు రద్దుకు సిఫారసు చేస్తామని సీఐ పేర్కొన్నారు.

• జై శ్రీరామ్.. జై హనుమాన్



బైక్ ర్యాలీలో పాల్గొన్న భక్తులు



పాదయాత్రగా వస్తున్న శివస్వామి తదితరులు



కోలాటం ఆడుతున్న చిన్నారులు





బైక్ ర్యాలీలో మేము సైతం

హనుమత్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ మహానగర్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన బైక్ ర్యాలీ వైభవోపేతంగా జరిగింది. భారత్ మాతాకు జై, జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. బీఆర్టీఎస్ రోడ్డులోని శివరామ కృష్ణ క్షేత్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవి కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయులందరూ మాతృమూర్తుల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సుదీర్ఘ పోరాటం వల్ల అయోధ్యలో రామమందిరం నిర్మాణం కల సాకారమైందని చెప్పారు. కేవలం అది నిర్మాణం మాత్రమే కాదని కోట్లాది భారతీయుల కోరిక అని అభివర్ణించారు. హనుమంతునిలోని సేవా గుణం, కార్యదక్షతను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తాళ్లయపాలెం శైవపీఠాధిపతి శివస్వామి ర్యాలీని ప్రారంభించారు. రామకోటి నుంచి ప్రారంభమైన ర్యాలీ బీఆర్టీఎస్ రోడ్డు, మీసాల రాజారావు వంతెన, సత్యనారాయణపురం వరకు కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి సాదినేని యామినీ శర్మ, నాగలింగం శివాజీ, విశ్వహిందూ పరిషత్ బాధ్యులు దుర్గాప్రసాద్, రాఘవరాజు, కె.రామకృష్ణ, సానా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

– విజయవాడకల్చరల్

- ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో వరంగల్‌కు చెందిన శ్రీచంద్ర నృత్య కళాక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శనివారం సాయంత్రం పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన జరిగింది.